# పగలని ప్రతిమలో పగిలిన హృదయం

— గుడిసేవ సుందరరామయ్య

"శేఖర్" అంటూ గట్టిగా అరవాలను కొంది అన్నపూర్ణ. కాని గొంతు పెగల్లేదు.

హృదయాంతరాల్లోంచి ఉబికి వస్తున్న ఉద్రేకం, ఉద్వేగం ఆమె స్వరాన్ని స్వాధీనం చేసుకొన్నాయి.

గొంతునిండా దుఃఖం—

గుండెనిండా వ్యధ—

మండుటెండల్లో వాడిన పువ్వులా మారింది ఆమె వదనం.

చెక్కిళ్ళు అశ్రు వదనాన్ని దాల్చాయి.

పెదాలు చిగురుటాకుల్లా కంపించాయి.

ముక్కుపుటాలు ఎగిరెగిరి పడుతున్నాయి.

విశాలమైన నేత్రాలు క్షణంలో కన్నీటి కొలనుల్లా మారిపోయాయి.

చేతిలోవున్న ఉత్తరాన్ని నేలమీదికి విసరి మంచంమీద వాలిపోయింది

"పూర్ణా! ఏమైంది?" అంటూ దగ్గరకు వచ్చాడు ఆనందరావు.

భర్తకు గొంతు విప్పి సమాధానం చెప్పే స్థితిలో ఆమె లేదు. తలగడ దిండులో ముఖాన్ని దాచుకొని వెక్కివెక్కి ఏడుస్తూంది.

ఆనందరావు మౌనంగా నేలమీద పడివున్న ఉత్తరాన్ని చేతిలోకి తీసుకొన్నాడు.

'అమ్మకు,

శేఖర్ నమస్కరించి వ్రాయునది. నా వివాహ విషయంలో నీవు తీసుకొన్న నిర్ణయాన్ని నేను ఆమోదించలేకపోతున్నాను. ఈ లోకాన్ని అర్థం చేసుకొనే వయసు నాకు వచ్చినా నీ దృష్టిలో నేను పసివాణ్ణిగానే కన్పిస్తున్నాను. చిన్నప్పుడు ఆడుకోటానికి బజార్లో బొమ్మను కొని యిచ్చినట్లే మేనమామ కూతురు లక్ష్మిని తీసుకువచ్చి నాకు భార్యను చేయాలనుకొంటున్నావు. కాని అమ్మా! బొమ్మకు భార్యకు తేడా వుంది. భావి జీవితాన్ని ఎలా దిద్దుకోవాలో, జీవిత భాగస్వామిని ఎవర్ని ఎన్నుకోవాలో వ్యక్తిగతంగా నిర్ణయించుకొనే శక్తి నాకుంది నా వివాహ విషయంలో నాన్నగారు నాకు ఎలాంటి ఆంక్షలు విధించలేదు. ఎందుచేత? ఆయన మగవారు! నా మనసును అర్థం చేసుకొన్న వారు– నేను మనసారా ప్రేమించిన జయంతిని భార్యగా స్వీకరించాలనుకొంటున్నాను రేపటి వరకు సెలవు యిస్తున్నాను నేను ప్రస్తుతం రాజమండ్రిలో బాబాయిగారింట్లో వున్నాను. నీ నిర్ణయం మార్చుకొని రేపు– అంటే ఆదివారం సాయంత్రం లోగా ఫోన్ చేయి! నీ దగ్గర నుండి ఫోన్ రాని పక్షంలో సోమవారంనాడు అన్నవరంలో దేవునిసన్నిధిలో జయంతిని పెళ్ళి చేసుకొంటాను.

— శేఖర్'

ఉత్తరం చదివిన ఆనందరావు దీర్ఘంగా నిట్టూర్చాడు. మెల్లగా వెళ్ళి అన్నపూర్ణ ప్రక్కనే మంచంమీద కూర్చున్నాడు.

"ఇలాంటి క్షణం వస్తుందని నేను భయపడుతూనే వున్నాను పూర్ణా!" అన్నాడు కళ్ళజోడు తీస్తూ.

అన్నపూర్ణలో దుఃఖం మరింత అధికమైంది.

"పూర్ణా! ఏమిటోయ్ మరీ చిన్నపిల్లలా!" లాలనగా అన్నారు.

"అవునండి! చిన్న పిల్లనే! నవమాసాలు మోసి కని పాతికేళ్ళు పైగా పెంచి పెద్ద చేసినా నేను వాడికి తల్లిని కాలేకపోయానండి! నా మాటకు విలువ లేకుండా పోయింది. మీ తండ్రీ కొడుకుల దృష్టిలో నేను చిన్న పిల్లనే!" ఆవేశంగా పల్కింది అన్నపూర్ణ. ఆమె మనసు తీవ్రంగా గాయపడిందన్న విషయం గ్రహించటంచేత ఆమెను ఊరడించటానికి ప్రయత్నించాడు ఆనందరావు.

"చూశావటోయ్ పూర్ణా! నీ కన్నీటికి కాటుక కరిగి చెంపలమీద ఎలా జారుతుందో! చిన్న విషయానికే ఎందుకిలా బాధపడ్తావ్?" అంటూ భుజాన వున్న టవల్‌తో ఆమె కన్నీటిని తుడిచాడు.

"మీకు ప్రతిదీ చిన్న విషయంగానే కన్పిస్తుంది కన్నతల్లికి కొడుకు ఉత్తరం రాసే విధానం యిదేనా? తల్లికి కొడుకు యిచ్చే గౌరవం యిలాంటిదేనా?"

"వాడి మనసులోని విషయాన్ని వాడు చెప్పాడు అయినా తెగేదాకా తీగను లాగకూడదోయ్!"

"అంటే మీ ఉద్దేశ్యం..."

"శేఖర్‌కు లక్ష్మి భార్య అయితే ఈడు జోడు బాగుంటుందని నీవు అనుకోవటంలో తప్పులేదు నీ మనసులోని విషయం వాడికి చెప్పావు. అంతవరకు బాగానే వుంది కాని కాలం మారుతూంది నడుస్తున్న కాలంతో పాటు మనం కూడా కొన్నికొన్ని విషయాల్లో రాజీపడి తదనుగుణంగా అడుగులు వేయక తప్పదు లోగడైతే తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధాలను కిక్కురుమనకుండా చేసుకొనే వాళ్ళు పిల్లలు కాని ఇప్పుడు అలా జరగటం లేదు కారణం – ప్రతిఒక్కరు ప్రేమ వలయంలో చిక్కుకుపోతున్నారు ప్రేమించి పెళ్ళి చేసుకొంటే సంసారం సుఖవంతంగా వుంటుందన్న భావన నేటి యువతరంలో పెరిగిపోయింది వీళ్ళలో ఆత్మవిశ్వాసం పెరుగుతూంది స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం మనసు ఉరకలు వేస్తూంది. వీళ్ళ ఊహాజగత్తుకు, ఆశాసౌధాలకు అండగా నిలుస్తున్నాయి నేటి నవలలు, సినిమాలు. ప్రేమబంధం ముందు రక్తబంధం నిలువలేకపోతూంది. అందుకే శేఖర్ ఇలా ప్రవర్తిస్తున్నాడు."

"అందుకని...వాడి పెళ్ళి ఆ జయంతితో జరిపించమంటారా? వీల్లేదు! నేను బ్రతికుండగా అలా జరగటానికి వీల్లేదు!"

"పూర్ణా ! ఏమిటా మూర్ఖత్వం ?"

"ఆఁ ... నాది మూర్ఖత్వమా ? నాకు నచ్చిన పిల్ల నా ఇంటికి కోడలిగా రావాలనుకోవటం మూర్ఖత్వమా ? పిల్లల బాగోగులను చూడాల్సిన బాధ్యతను తల్లిగా నిర్వర్తించటం మూర్ఖత్వమా ?"

"కన్నతల్లిగా నీవు పడే ఆవేదనను నేను అర్థం చేసుకొన్నాను. పిల్లలను క్రమశిక్షణతో పెంచి, వంశ గౌరవాన్ని నిలబెట్టే వ్యక్తులుగా తీర్చిదిద్దటానికి ప్రయత్నించటం కన్నవారి బాధ్యత ! ఆ బాధ్యతా నిర్వహణలో ఒక్కోసారి వారి అభిరుచులకు విరుద్ధంగా నడ్చుకోమని శాసించటం వాళ్ళ శ్రేయస్సు దృష్ట్యా అవసరం అవుతుంది కూడా !' అయితే కొంత వయసు వచ్చాక — అంటే వాళ్ళు కూడా తమంత ఎదిగి లోకజ్ఞానాన్ని సంపాదించుకొన్నాక కూడా వాళ్ళను తమ చెప్పుచేతల్లో వుంచుకోవాలని కోరుకోవటం కేవలం అజ్ఞానమే అవుతుంది !"

"అయితే మన కళ్ళెదుటే వాళ్ళు పెడదార్లు పడుతుంటే చూస్తూ వూరుకోవాలంటారా ?"

"అలా అని ఎవరూ సలహా యివ్వరు, వాళ్ళు ఎన్నుకొన్న దారి ప్రతిదీ పెడదారి అని నిర్ధారణ చేసుకొనే ముందు ఆ దారి ఎలాటిందో, వాళ్ళు ఎందుకు ఆ దారిని నడవాలనుకొంటున్నారో వివరంగా తెల్సుకోటం కన్నవారి బాధ్యత ?"



"అయితే వాడు తీసుకొన్న నిర్ణయాన్ని మీరు సమర్థిస్తున్నారా ?"

"భార్యను ఎన్నుకోవటంలో శేఖర్ పొరపాటు పడలేదు. కేవలం బాహ్యమైన ఆకర్షణలకు లొంగిపోయి శేఖర్ ఈ నిర్ణయం తీసుకోలేదు. వాడు మనస్ఫూర్తిగా ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. పూర్ణా! ఎవరి మనసులోనైనా ప్రేమ బీజం మొలకెత్తడంటే అది మొక్కగా పెరిగి శాఖోపశాఖలతో విస్తరించి మహావృక్షమై మనిషిని వశపర్చుకొంటుంది. శేఖర్ మనసులో ప్రేమబీజం మొలకెత్తకపోయి వట్లయితే నీ మాటకు కట్టుబడి లక్ష్మినే పెళ్లి చేసుకొనేవాడు."

"మీకు నా కంటే వాడిమీదే ప్రేమ ఎక్కువ!" ఉక్రోషంగా అంది అన్నపూర్ణ.

"ప్రే...మ...ఎంత విచిత్రమైన పదం! మాటల్లో విన్పించేది ఎప్పుడూ నిజమైన ప్రేమకాదు. కొన్ని కొన్ని పరిస్థితులదృష్ట్యా మనిషి ప్రేమ అనే పదాన్ని వాడుకొంటూ, తనను తాను మోసగించుకొంటూ ఎదుటి

## పగలని ప్రతిమలో...

వారిని మోసగిస్తూ అవసరాలు తీర్చుకొంటున్నాడు ఈ కలియుగంలో. నిజమైన ప్రేమకు నిలయం తియ్యని పలుకులను పలికే పెదవులు కాదు! పది కాలాలపాటు జ్ఞాపకాలను పదిలపర్చగల హృదయం! ఆలయంలోని దేవునిలా హృదయం లోని ప్రేమ ఎంతో పవిత్రమైనది. అది ప్రేయసీ ప్రియుల ప్రేమ కావచ్చు! భార్యాభర్తల ప్రేమ కావచ్చు, మాతృ ప్రేమ కావచ్చు! పితృప్రేమ కావచ్చు! స్నేహితుల ప్రేమ కావచ్చు! హృదయంలో భద్రపర్చబడిన ప్రేమ శాశ్వతమైనది!"

ప్రేమ తత్వాన్ని ఉపన్యాస ధోరణిలో చెప్తున్న భర్తవైపు ఆశ్చర్యంగా చూస్తుండిపోయింది అన్నపూర్ణ.

"వాడి హృదయంలో మనపట్ల ప్రేమ వుంది కాబట్టే మన అనుమతి కోసం ఆ వుత్తరం రాశాడు. తల్లిదండ్రులకు ఆ మాత్రం అవకాశం, గౌరవం కూడా యివ్వకుండా ప్రవర్తించే ప్రబుద్ధులు ఈ కాలంలో కోకొల్లలు! వారందరి కంటే శేఖర్ ఎంతో నయం! ఆలోచించుకోటానికి, మన పెద్దరికం నిలబెట్టుకోటానికి మనకు అవకాశం ఇచ్చాడు!"

"మీరెన్ని చెప్పినా ఈ పెళ్లి నేను ఒప్పుకోను. లక్ష్మిని కోడలిగా చేసుకుంటావని మా వదినకు మాటిచ్చాను!"

"పిచ్చిదానా! వాళ్లకు వాగ్దానం చేసినప్పటి పరిస్థితులు వేరు. అయినా చనిపోయిన వాళ్లకిచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకొనే ప్రయత్నంలో బ్రతికున్న వాళ్లకు నరకం సృష్టించకూడదు పూర్ణా!"

"మీ నీతి వాక్యాలను నేను వినదల్చుకోలేదు. శేఖర్‌కు భార్య కావల్సింది లక్ష్మి! జయంతి కాదు!" అంటూ విసురుగా వంట గదిలోకి వెళ్లింది అన్నపూర్ణ.

* * *

ఆ రాత్రి ఆ భార్యాభర్తలిద్దరికీ నిద్ర పట్టలేదు. అన్నపూర్ణ మంచంమీద అసహనంగా అటు ఇటు కదులుతూ పైన తిరుగు


మీ కేశ సౌందర్యాభివృద్ధికి కొబ్బరినూనె కంటె అతి ఉత్తమమైనదేది?

# కేశవర్ధినిని

చేర్చిన కొబ్బరినూనె






ఔను! మీరు ప్రతి నిత్యమూ తలకు రాసుకుంటూన్న కొబ్బరినూనెలో కొన్ని చుక్కలు కేశవర్ధినిని కలపండి. తల చర్మానికి అంటే టట్టుగా తలకు రాసుకోండి.
ఇదే అందంగా తల వెంట్రుకలు పెరగడానికి సాంప్రదాయిక రహస్యము-కేశవర్ధిని.
వెంటనే ఒక బాటిల్ కేశవర్ధినిని కొని వాడండి.




కేశవర్ధిని ప్రొడక్ట్స్ (మద్రాసు)
మద్రాసు-600 092

తున్న సీలింగ్ ఫేన్ వైపు చూస్తూండి పోయింది. మధ్య మధ్య పక్కకు తిరిగి కిటికీ లోంచి కన్పిస్తున్న దృశ్యాన్ని చూడసాగింది. కిటికీగుండా చూస్తే ఆనందరావు ఆఫీసుగది కన్పిస్తుంది అక్కడ అతను టేబుల్ లైటు వేసుకొని డైరీలో పేజీలు తిప్పుతున్న దృశ్యం అన్నపూర్ణకు కన్పించింది.

"పాలు తీసుకోండి!" అన్న మాటలు విన్పించగానే రెండు చేతుల మధ్య ముఖాన్ని దాచుకొని ఆలోచిస్తున్న ఆనందరావు తలెత్తి చూశాడు. అన్నపూర్ణను చూడగానే ఎదురుగా వున్న డైరీని మూసి పాలగ్లాసును అందుకొన్నాడు.

అన్నపూర్ణ వెంటనే అక్కణ్ణుంచి వెళ్ళి పోయింది.

నెమ్మదిగా నడిచి వెళ్ళిన ఆమెవైపు కొన్ని క్షణాలు చూస్తుండిపోయాడు ఆనందరావు.

పూర్ణకు తనంటే ఎంత ప్రేమ?

రోజూ పడుకొనే ముందు పాలు త్రాగే అలవాటు తనకుందని అమ్మ పెళ్ళయిన రోజే కోడలితో చెప్పింది. ఆ సంగతి జాగ్రత్తగా గుర్తుంచుకొని పెళ్ళయినదగ్గర్నుంచి ఈ నాటి వరకు తన అలవాటుకు భంగం కల్గకుండా చూసుకొంటుంది పూర్ణ.

తనంటే ఆమెకు ఎంతో ప్రేమ!

కాని ఆమె అంటే తనకు...?

నిజంగా ప్రేమ వుందా?

హే భగవాన్! తనెంత మోసం చేసున్నాడు!

లక్ష్మిని చేసుకొంటే రేపు శేఖర్ కూడా జీవితాంతం ఇలానే భార్యను మోసంచేయాల్సి వుంటుంది కదూ! నో... వీల్లేదు... అలా జరగటానికి వీల్లేదు... గబగబా డైరీ తెరిచాడు ఆనందరావు.

* * *

"శేఖర్! నేమరా! మీ అమ్మనుమాట్లాడు తున్నాను. నీ ఇష్టప్రకారంగానే జయంతిని చేసుకొందువుగాని. నేను, మీ నాన్నగారు ఈ రోజే బయల్దేరి రాజమండ్రి వస్తున్నాం!..." మర్నాడు పుదయం కొడుక్కి ఫోన్ చేస్తున్న అన్నపూర్ణను చూడగానే ఆనందరావులో ఆశ్చర్యం, ఆనందం కల్గాయి.

రాత్రికి రాత్రే ఆమెలో ఇంతమార్పు రావటానికి కారణం ఏమిటా? అని ఆలోచిస్తున్న అతనికి వెంటనే ఏదో స్ఫురించి ఆఫీసు గదిలోకి వెళ్ళాడు.

గతరాత్రి తనుతానిన డైరీని టేబుల్‌మీదనే మర్చిపోయినందుకు తిందాలుపడి పేజీలు త్రిప్పాడు.

"...జీవితంలో ఏదైతే జరగకూడదని నే నింతకాలం దేవుణ్ణి ప్రార్థించానో అదే జరిగింది ఈ వేళ!

తన పట్టుదలను వదలకుండా భీష్మించు క్కూర్చున్న భార్య ఒకప్రక్క—ప్రేమకు బందీ అయి కన్నవారికి దూరం కావటానికి సిద్ధ పడిన కొడుకు మరోప్రక్క—

దాదాపు ముప్పయ్ ఏళ్ళ క్రితం ఇదే పరిస్థితి తన తండ్రికి ఎదురైంది.

చరిత్ర పునరావృతం కావటమంటే ఇదేనేమో!

అయితే ఆ నాడు నేను తల్లి మీద వాత్సల్యంతో మనసార ప్రేమించిన రేణుకను దూరం చేసుకొన్నాను.

ఈనాడు శేఖర్ కూడా నాలా తల్లి ప్రేమకు కట్టుబడి వివాహం చేసుకొంటే లక్ష్మి సుఖపడుతుందా ?

ఎందుకు సుఖపడదు ?

మేనమామ కూతురైన అన్నపూర్ణ ఇంతకాలం సుఖపడలేదా ?

నో ... వీల్లేదు ...

మనువు ఒకరితో —

మనసు మరొకరితో—

ఎలా సాధ్యం ?

ఇంతకాలం గుట్టుగా నా హృదయంలో అంతులేని శోభను అనుభవించాను. ఓ డాక్టర్‌ను పెళ్ళాడి రేణుక స్టేట్స్‌కు వెళ్ళి పోయినా ఆమె రూపం నా హృదయంలో చెదరలేదు. ఇప్పటికీ నేను ఆమెను ఆరాధిస్తు న్నాను. ఆమెను చూసే అదృష్టం మళ్ళీ ఎప్పుడు కల్గుతుందా? అని ఎదురు చూస్తు న్నాను.

మనసులో లేని ప్రేమను మాటల్లో కనబరచి ప్రవర్తించటం అన్నపూర్ణను మోసం చేసినట్లు కాదా ?

ఇలాంటి శోభకు శేఖర్ గురి కాకూడదు!

శేఖర్ వివాహం జయంతితోనే జరగాలి!

ఈ విషయంలో అన్నపూర్ణను ఒప్పించాలి!

పైకి అందంగా కన్పించే ప్రతిమలో పగిలిన హృదయం వుంటుందన్న నిజం అన్నపూర్ణకుతెలిస్తే ఆమెభరించగలదా...?"

ఆ పేజీ నిండా వున్న కన్నీటి గుర్తులు, కాటుక మరకలు ఆనందరావుకు అన్నపూర్ణను గుర్తు చేయటానికి ప్రయత్నించాయి. అంతే! ఆనందరావు గబగబ అన్నపూర్ణ గదిలోకి వెళ్ళాడు

